క్లుప్తంగా

వరిలో పంట కోత ప్రయోగం



చందలూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని చందలూరు వద్ద నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది సోమవారం వరిలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన వెంకటరాజు, గౌరీశంకర్‌రెడ్డి అనే రైతుల పొలాల్లో నిర్ణీత వ్యాసార్థంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 17.7 కేజీల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ లెక్కన ఎకరానికి 34 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేశారు. కార్యక్రమంలో సీసీ వెంకటేశ్వర్లు, ఏఈఓ రాజు, వీఏఏ మహేశ్వరి, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 24వ తేదీన జరిగిన 7వ రాష్ట్రస్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ ఎంపిక పోటీల్లో నంద్యాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ చైర్మన్ ఇస్మాయిల్, కార్యదర్శి ఇబ్రహీం సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 15 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా క్రీడాకారులు పలు అంశాల్లో పది బంగారు, 12 వెండి, 8 కాంస్య పతకాలు సాధించగా ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మూడవ స్థానం నిలిచిందన్నారు. ఇందుకు కృషి చేసిన సీనియర్ మాస్టర్లు నబిరసూల్, ఖాదర్‌ను అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



లహరిని అభినందిస్తున్న చాణిక్యరాజు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎస్పీజీ ఉన్నత పాఠశాలకు చెందిన లహరి ఎంపికైందని హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణిక్యరాజు తెలిపారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో జరిగే సబ్ జూనియర్స్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. లహరి, కోచ్ శ్రావణ్‌ను సోమవారం అభినందించారు.

మహిళల ఆర్థిక స్థితిగతులపై సర్వే

శిరివెళ్ల: డ్వాక్రా సంఘాల్లోని మహిళల ఆర్థిక స్థితిగతులపై ముమ్మరంగా సర్వే జరుగుతోందని వెలుగు ఏపీఎం రాజశేఖరరెడ్డి సోమవారం తెలిపారు. మండలంలో 1459 సంఘాల్లో 15,559 మంది మహిళలున్నారని చెప్పారు. అందులో ఇప్పటి వరకు 6,686 మంది మహిళలకు సంబంధించిన సమగ్ర సర్వే పూర్తియయిందని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ఉయ్యాలవాడ: మండలంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27న కొండుపల్లె, హరివరం గ్రామ సచివాలయాలు, 28, 29న ఉయ్యాలవాడ, మాయలూరు గ్రామ సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డుల్లో తప్పులు, నూతనంగా ఆధార్ నమోదు చేసుకోవాలనే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26వ తేదీన కార్మిక సంఘాలు, రైతు సంఘం కిసాన్ సంయుక్త మోర్చ జాతీయ సమితి పిలుపు మేరకు నంద్యాల జిల్లాలోని రైతు సంఘాలు, కార్మిక సంఘాలు ఏకమై సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోని డోన్, బనగానపల్లె, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, పాణ్యం నియోజకవర్గాల నుంచి కార్మికులు, రైతులు పాల్గొని శ్రీనివాససెంటర్ నుంచి చేపట్టే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలన్నారు. బాబాఫక్రుద్దీన్, శివ బాలకృష్ణ, శ్రీనివాసులు, హరినాథ్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సహకరించాలి

నంద్యాల(రూరల్): రాష్ట్రాభివృద్ధికి అమెరికా తెలుగు అసోసియేషన్ (తానా) సభ్యుల సహకారం ఎంతో అవసరమని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. అమెరికాలో జరుగుతున్న యునైటెడ్ నేషన్స్ జనరల్ 79వ అసెంబ్లీ సమావేశాలకు భారత ప్రతినిధిగా వెళ్లిన ఆమెను సోమవారం తానా సభ్యులు సన్మానించారు. ఆమె మాట్లాడుతూ తానా సభ్యులు మాతృభూమి ఋణం తీర్చుకోవాలని కోరారు.

శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

- కడ సోమవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తులతో కిక్కిరిసిన శైవ క్షేత్రాలు



ఆళ్లగడ్డ: కార్తీక వనభోజనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

ఆళ్లగడ్డ: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా నియోజకవర్గంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆళ్లగడ్డ శివారులోని కాచింతల క్షేత్రం తెల్లవారుజాము నుంచే భక్తులతో నిండిపోయింది. వక్కిలేరు వాగులో పుణ్యస్నానాలు ఆచరించేందుకు మహిళలు బారులు తీరారు. ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణలతో కాచింతల క్షేత్రం మారుమోగింది. కార్తీక దీపాలు వెలిగించి, గౌరమ్మలను చేసి గంగలో వదిలి ముక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కాశీ విశ్వేరున్ని దర్శించుకుని పూజలు చేశారు.

కోటి దీపోత్సవం

ఆలమూరు శివాయలంలో కోటి దీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివుడికి ప్రత్యేక పూజలు చేశారు.

శిరివెళ్ల/దొర్నిపాడు: వీరారెడ్డిపల్లె బ్రహ్మంగారి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. గుడిపై జెండాలను ఎత్తే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక కాశిరెడ్డినాయన ఆశ్రమం, యర్రగుంట్ల గీతా మందిరం, వీరారెడ్డిపల్లెలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. దొర్నిపాడులోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

ఉయ్యాలవాడ: స్థానిక అగస్తీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇంజేడు గ్రామంలో శివలింగానికి భక్తులు అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మాయలూరు గ్రామంలో వన భోజనం ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: పవిత్ర కార్తీక మాసం కడ సోమవారం సందర్భంగా మండలంలోని ముత్యాలపాడు భైరవేశ్వరాలయం, చింతలచెరువులోని భైరవ గుండాల వద్ద వెలసిన శివాలయం, మల్లెవేముల మల్లేశ్వర స్వామి ఆలయం, చాగలమర్రి రామలింగేశ్వర స్వామి ఆలయం, భీమలింగేశ్వరస్వామి ఆలయం, బసవేశ్వరాలయం, బుగ్గ మల్లేశ్వరస్వామి ఆలయం, చాగలమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చాగలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వన భోజన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శివనాగప్ప ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు గడ్డమీది వెంకటేశ్వర్లు, ధర్మకర్త గడ్డమీది శినాగప్ప, నాగరమేష్, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరంరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ: కోటి దీపోత్సవం



ప్రత్యేక అలంకారంలో నాగలింగేశ్వర స్వామి

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శైవ ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రథమనంది, సోమనంది, బ్రహ్మానందీశ్వర ఆలయం, నాగనంది, నాగలింగేశ్వరస్వామి, కాళికాంబ చంద్రశేఖర, సంజీవనగర్ రామాలయం, స్పటిక లింగేశ్వర తదితర దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేపట్టి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం ప్రథమనంది ఆలయంలో కేథారేశ్వర నోములను చేపట్టారు. సాయంత్రం పల్లకీ సేవ జరిపించారు. సాయంత్రం ఆయా దేవాలయాల్లో ఆకాశ దీపాన్ని వెలిగించి స్వామివారికి నాగాభరణం అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉదయం నుంచే ఉపవాస దీక్షతో ఉండి సాయంత్రం నక్షత్రాలను చూసి దీక్ష విరమించారు.



శిరివెళ్ల: జెండాను గుడిపై ఎత్తుతున్న మహిళలు



ఉయ్యాలవాడ అగస్తీశ్వర ఆలయంలో..



చాగలమర్రి: రామలింగేశ్వరస్వామి ఆలయంలో..



దొర్నిపాడు: క్రిష్టిపాడులోని కుందూలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చాగలమర్రి చాగలమ్మ గుడి వద్ద వన భోజనం



భీమలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం



ప్రథమనందీశ్వరునికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

జాగ్రత్తలతో జీవాల సంరక్షణ

- చలి కాలంలో అప్రమత్తంగా ఉండాలి
- టీకాలు తప్పనిసరిగా వేయించాలి
- పోషకాహారంతో వ్యాధి నిరోధక శక్తి



మేతకు వెళ్తున్న జీవాలు

గోస్పాడు: శీతాకాలంలో జీవాలకు సంక్రమించే వ్యాధులపై పోషకులు జాగ్రత్తలు పాటించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా జీవాల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశాలు అధికం. ఉష్ణోగ్రతలు తగ్గుతున్న నేపథ్యంలో గొర్రెలు, మేకలు, వాటి పిల్లలకు వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు పాటించడంతో పాటు సకాలంలో వ్యాక్సిన్లను వేయించి వాటిని సంరక్షించుకోవాలి. గోస్పాడు మండల పరిధిలోని గ్రామాల్లో 11,031 గొర్రెలు, 1,702 మేకలున్నాయని పశువైద్యులు చెబుతున్నారు. ఈ కాలంలో చేపట్టాల్సిన చర్యలు..

- చలిని తట్టుకునే శక్తి వచ్చే వరకూ తల్లి గొర్రె నుంచి పాలు అందేలా పిల్లలను చూసుకోవాలి. దీని వల్ల గొర్రె పిల్లల్లో ఎదుగుదల, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. పిల్లలకు చలిగాలులు తగలకుండా, శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- గొర్రె, మేక పిల్లలు మట్టిని నాకకుండా చూడాలి. మట్టి నాకడం వలన పారుడు రోగం లాంటి వ్యాధులు సోకుతాయి. ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్చర్) కలిగిన ఇటుకలను పిల్లలు గూళ్లలో వేలాడదీయాలి. పిల్లలను ఎక్కువ సంఖ్యలో ఉంచితే ఖాళీ ప్రదేశం లేకపోతే వాటిలో ఒత్తిడి నెలకొంటుంది. విశాలంగా, శుభ్రమైన గాలి, వెలుతురు తగిలేలా చూసుకోవాలి. రాత్రిళ్లు వెచ్చదనం ఉండేలా లైట్లను లేదా అడ్డుతెరలు ఏర్పాటు చేయాలి.
- జీవాలు ఉండే ప్రాంతాల్లో భూమిలో తేమశాతం లేకుండా ఉండాలి. పొడి వాతావరణం, ఎత్తైన ప్రదేశాలను ఎంచుకోవాలి.
- తేమ వల్ల పరాన్న జీవులు, సూక్ష్మజీవుల బెడద ఎక్కువై వ్యాధులు ప్రబలి జీవాల మరణాలు చోటుచేసుకునే అవకాశముంది
- చలికాలంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. గోమార్ల నివారణ చర్యలు చేపట్టాలి. పిల్లలను బయిట ప్రదేశాల్లో ఉంచితే దోమతెరలు వాడాలి. చిన్నపాటి షెడ్లలో రక్షణ ఏర్పాటు చేసి పెంచడం ఉత్తమం.
- జబ్బులు వ్యాపిస్తే మంద నుంచి పిల్లలను వేరు చేయాలి. పిల్లలన్నింటికి ఎంసీ ఈటీ టీకాలను వేయించాలి. యాంటీబయోటిక్స్, బీ–కాంప్లెక్స్, లివర్ టానిక్‌లు, ఈస్ట్ కల్చర్లు, జీర్ణ క్రియ మందులు, ఐరన్, కాల్షియం తదితర మందులు పశువైద్యుడి సూచనల మేరకు అందజేయాలి.
- కాలిగిట్టల మధ్య చీము చేరి చెడు వాసన రావడం, కుంటడం లాంటి లక్షణాలు ఉంటే కాలి పుండ్ల వ్యాధిగా గుర్తించి బురద ప్రాంతాల్లో మేపకుండా చూడాలి. నట్టల మందు తాపించాలి.కాలిపుండ్లు బాగా కడిగి పుసుపు లేదా ఆయింట్‌మెంట్ రాసి మట్టి తగలకుండా రెండు రోజులు మందులు వాడాలి.
- పారుడు, చిటుకు వ్యాధులు వంటివి సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలి.

జబ్బు చేస్తే వైద్యులను సంప్రదించాలి



జీవాలను రాత్రివేళల్లో చలి బారినుంచి రక్షించుకోవాలి. జీవాలను ఎప్పటికప్పుడు వాటి కదలికలను, జీవం ఆరోగ్యంగా ఉన్న విషయాన్ని గుర్తించగలగాలి. ప్రభుత్వ పశువైద్యశాలల ద్వారా జీవాలకు అన్నిరకాల వ్యాక్సిన్లను ఎప్పటికప్పుడు వేస్తున్నాం. జీవాలకు చలి కాలంలో ఎటువంటి సమస్యలు వచ్చినా వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకే వాటికి మందులు వినియోగించాలి. – అభిలాష్‌రెడ్డి, పశువైద్యాధికారి, యాళ్లూరు.

ఇంకుడు గుంతలకు స్థల పరిశీలన



క్రిష్టిపాడులో ఇంకుడుగుంత స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

దొర్నిపాడు: ఇంకుడు గుంతల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీ సూచించారు. సోమవారం మండలంలోని కొండాపురం, క్రిష్టిపాడు గ్రామాల్లో ని అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో నిర్మించేందుకు ఇంకుడు గుంతలు మంజూరు అయినట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్థల పరిశీలన చేసి ఒక్కో గుంతకు రూ.16 వేలు నిధులు వచ్చాయని, చుట్టు ఏడు అడుగుల విస్తీర్ణంతో పాటు 8 అడుగుల లోతు ఉండాలని పేర్కొ న్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉజ్మా, సర్పంచ్ శివరామిరెడ్డి, మండల కోఆర్డినేటర్ జర్మియా పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా



కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ఈ నెల 29వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, కేఎల్ గ్రూప్, త్రీ క్వీస్ కార్పొరేషన్‌కు చెందిన ప్రతినిధులు జాబ్‌మేళాకు వస్తున్నారన్నారు. పది, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. సమాచారం కోసం 91548 30286, 91822 17075 సెల్ నంబర్లను సంప్రందించాలన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: వివిధ పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి విశ్వ విద్యాలయ విద్యార్థులు మండలంలోని వెలగటూరు గ్రామ రైతులకు పలు సూచనలు తెలియజేశారు. మిరప పంటలో బంక అట్టల ఏర్పాటు, వాటి ఆవశ్యకత, రసం పీల్చు పురుగుల ఉధృతిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. మిరప, మినుము పంటల్లో త్రిప్స్, పేను బంక, తదితర చీడపీడల నివారణ పద్ధతులను వివరించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

- మొదటి స్థానంలో ఎస్.కొత్తూరు వృషభాలు



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

బనగానపల్లె రూరల్: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పసుపల గ్రామంలోని గుండం మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో వృషభాల రాతిదూలం పోటీలు హోరాహోరీగా జరిగాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ సహకారంతో అంతర్రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. మొత్తం 9 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన బీరంబుల్స్, బీరం సుబ్రమణ్యేస్వరరెడ్డి వృషభాలు నిలిచాయి. రెండో బహుమతిని నాగర్ కర్నూలు జిల్లా రాయవరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి, మూడో బహుమతి నంద్యాల జిల్లా పిన్నాపురం వెంకటసుబ్బయ్యయాదవ్ వృషభాలు కైవసం చేసుకున్నాయి. నాల్గో బహుమతి గద్వాల్ జిల్లా ఉత్తనుర్ గ్రామానికి చెందిన యశ్వంత్‌యాదవ్, నరేష్ వృషభాలు, ఐదో బహుమతి నంద్యాల జిల్లా బిల్లలాపురం గ్రామం గోవర్ధన్‌రెడ్డి ఎడ్లు దక్కించుకున్నాయి. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20వేలు.రూ.10 వేలు యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆకుల సిద్ధేశ్వరప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

శిరివెళ్ల: ఆళ్లగడ్డ–నంద్యాల జాతీయ రహదారిపై గోవిందపల్లె వేబ్రిడ్జి వద్ద ఆదివారం రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. తీవ్రంగా గాయపడిన మహిళ(60) నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. వివరాలు.. కర్నూలులోని సంతోషనగర్‌కు చెందిన సిగరం చంద్రశేఖర్ (67) రిటైర్డ్ ఎస్‌ఐ. భార్య ఈశ్వరమ్మ, కుమారుడు రవికుమార్‌తో కలిసి ఈ నెల 22న కారులో అరుణాచలం వెళ్లారు. అక్కడ స్వామివారి దర్శనం అనంతరం 24వ తేదీ ఉదయం తిరుగు ప్రయాణమయ్యారు. మరోవైపు నంద్యాలలోని నడిగడ్డకు చెందిన షేక్ ఖాదర్‌బాషా (22) శిరివెళ్లకు కారులో వెళుతున్నాడు. గోవిందపల్లె వద్దకు రాగానే కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి చంద్రశేఖర్ కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్, ఖాదర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందారు. ఈశ్వరమ్మ, రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఈశ్వరమ్మ(60) పరిస్థితి విషమించడంతో నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

యురేనియం తవ్వకాలతో తీరని నష్టం

ప్యాపిలి: యురేనియం తవ్వకాల కారణంగా ఆ పరిసర గ్రామాల ప్రజలకు తీరని నష్టం వాటిల్లుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుంకయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని మామిళ్లపల్లి, జక్కసానికుంట్ల, రాంపురం గ్రామాల్లో సీపీఐ నాయకులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పచ్చని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాల కోసం టెండర్లను ఆహ్వానించడం దారుణం అన్నారు. ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. పంట పొలాలు బీడు భూములుగా మారిపోతాయన్నారు.

లింగ వివక్ష సరికాదు



బ్యానర్‌ను విడుదల చేస్తున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): లింగ వివక్ష కొనసాగించడం సరికాదని, ఆధునిక కాలంలో అందరూ సమానమేనని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జెండర్ క్యాంపెయిన్, నూతన చైతన్యం 3.0 బ్యానర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. హింసకు వ్యతిరేకంగా డీఆర్‌డీఏ, వెలుగు, సెర్ప్ ఉద్యోగులు ఈనెల 25 నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు కార్యక్రమాలు చేపడుతారని చెప్పారు.

జానాల గూడేనికి విద్యుత్ లైన్ ఏర్పాటు

కొత్తపల్లి: మండలంలోని జానాల గూడెంకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సుధాకర్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని జానాలగూడెంను ఏడీ రామసుబ్బయ్యతో కలసి పరిశీలించారు. ఎస్‌ఈ మాట్లాడుతూ సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు సుమారు 7 కి.మీ. మేర విద్యుత్‌లైన్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు.

ముగ్గురు యువకులకు గాయాలు

మహానంది: మహానందీశ్వర స్వామి దర్శనం అనంతరం ఇంటికి వెళ్తుండగా ఎదురెదురుగా వెళ్తున్న కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. గోస్పాడు మండలం సాంబవరం గ్రామానికి చెందిన నాగ చంద్రుడు, మోహన్, సురేంద్ర సోమవారం మహానంది నుంచి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు టైర్ పంక్చరై బైకుకు ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. కారులో ఉన్న సంగారెడ్డి జిల్లా తొగరుపల్లికి చెందిన శ్రీనివాస్, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.